క్లుప్తంగా

రైతులు సకాలంలో నీటి తీరువా చెల్లించాలి

కొత్తపల్లి: రైతులు సకాలంలో నీటి తీరువా పన్ను చెల్లించాలని తహసీల్దార్ చిన్నారావు సూచించారు. శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వం ఆన్‌లైన్ విధానంలో నీటి తీరువా పన్ను చెల్లించేలా చర్యలు చేపట్టిందన్నారు. 1432, 1433, 1434 ఫసలీలకు సంబంధించి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ వద్ద ఆన్‌లైన్ విధానంలో పన్ను చెల్లించి రసీదు పొందాలని సూచించారు. నీటి తీరువా పన్ను సాధ్యమైనంత త్వరగా చెల్లించి సహకరించాలని కోరారు.

సారా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న పోలీస్, ఎక్సైజ్ సిబ్బంది

పెద్దాపురం: మండలంలోని కట్టమూరు గ్రామ శివారులో సారాతయారీకి వినియోగించే సుమారు 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు పెద్దాపురం ఎస్సై మౌనిక శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సీఐ విజయ్‌శంకర్, ఎక్సైజ్ సీఐ అర్జునరావుల ఆధ్వర్యంలో కట్టమూరు శివారు పంట పొలాల్లో అక్రమంగా నిర్వహిస్తున్న సారా బట్టీలపై దాడులు జరిపి 800 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశామన్నారు. మండలంలోని అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించామని, చట్టాన్ని ఉల్లంఘిస్తే సహించేది లేదని ఎస్సై హెచ్చరించారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

సామర్లకోట: పట్టణంలో వేంచేసియున్న అతిపురాతన విష్ణు ఆలయం మాండవ్యనారాయణ స్వామి గ్రామోత్సవం శనివారం భక్తి శ్రద్ధలతో సాగింది. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయంలో ఉదయం స్వామి వారికి అభిషేకాలు, శ్రీదేవి, భూమి అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు విష్ణు సహస్ర నామ పారాయణ చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై స్వామి వారి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా గ్రామోత్సవం జరిగింది.

పంచారామక్షేత్రంలో శ్రావణ పౌర్ణమి పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిస్తున్న బాలత్రిపుర సుందరిదేవి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో శనివారం బాలా త్రిపుర సుందరి సమేత కుమార రామభీమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకొని ఆలయా అర్చకులు స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు చేశారు. అనంతరం స్వామివారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి ఆలయం చుట్టు ఊరేగించారు. భక్తులకు ఉదయం, మధ్యాహ్నం అన్నప్రసాదాలను వితరణ చేశారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

సామర్లకోట: స్థానిక సత్యనారాయణపురం, జయలక్ష్మి థియేటర్ రోడ్డులో ఆదివారం ఉదయం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు విస్సుకోట సురేష్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. బీపీ, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించి అవసరమైన వారికి మందులు అందులు అందచేస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఉదయం 6 గంటల నుంచి శిబిరం ప్రారంభమవుతుందని రోగులు ఎటువంటి ఆహరం తీసుకొకకుండా బీపీ, షుగర్ పరీక్షలకు హజరు కావాలన్నారు.

ద్వాదశ పుణ్యనదీ జలాలతో అభిషేకం



స్వామివారికి ద్వాదశ నదీజలాలతో అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో వెంకటగిరి కొండపై శ్రీదేవి, భూదేవి సమేతుడై వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి శనివారం ద్వాదశ (12) పుణ్యనదీ జలాలతో అభిషేకం నిర్వహించారు. స్వామి వారి జన్మ నక్షత్రమైన శ్రవణం, శ్రావణ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని దేవస్థానం చైర్మన్ బద్ది రెడ్డి అచ్చన్నదొర, కమిటీ సభ్యుల ఆధ్వర్యాన ఈ కార్యక్రమం నిర్వహించారు. గంగ, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి, కృష్ణ, తపతి, తుంగభద్ర, భీమ, ప్రాణహిత నదీ జలాలతో ఈ అభిషేకం చేశారు. అనంతరం, శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర సహిత మహా సుదర్శన యాగం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

షరా మామూలే..!

- యథేచ్ఛగా పందుల స్వైర విహారం
- ఆందోళనలో పట్టణ ప్రజలు
- నిర్లక్ష్య వైఖరిలో యంత్రాంగం



పట్టణంలో స్వైర విహారం చేస్తున్న పందులు

పెద్దాపురం: పట్టణ ప్రజలు సీజనల్ వ్యాధులతో అనారోగ్యాలకు పాల్పడినప్పుడే మున్సిపల్ అధికారులకు పరిశుభ్రత, పారిశుధ్యం గుర్తుస్తోంది. నిత్యం పట్టణంలో రద్దీగా ఉండే జనవాసాల మధ్య పందుల స్వైర విహారం చేస్తున్నా పారిశుధ్య యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. పెద్దాపురం పట్టణంలో ఏళ్ల తరబడిగా సీజనల్ వ్యాధుల సమయంలో పట్టణంలో ఏదో మూలన డయేరియా, అతిసార వంటి వ్యాధులు ప్రబలుతూనే ఉంటున్నాయి. ఆ సమయంలో అధికారులు ముందుస్తు చర్యలు చేపడతున్నామని ప్రకటనలు గుప్పిస్తున్నారే తప్ప వాటిపై చర్యలు తీసుకోవడం లేదనడానికి ఈ పందుల స్వైర విహారమే నిదర్శనం. పందుల పెంపకం దారులకు నోటీసులు జారీ చేశామని అదిగో ఇదిగో అంటూ కాలయనాపన చేస్తున్నారే తప్పా నిర్మూలనపై చర్యలు చేపట్టిన దాఖల్లాలేవు.

ప్రజలు బెంబేలు

ఉదయం లేచింది మొదలు రాత్రి వరకు ఏ వీధిలో చూసినా నివాసం ఉండే ఇళ్ల చుట్టూ తిరుగుతూ రోగాల పాలు చేస్తున్నాయి. ఇళ్ల మధ్య ఉన్న మురికి నీటిలో పొర్లుతూ అనారోగ్యాలకు ఆవాస కేంద్రంగా మారుస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఇళ్ల వద్ద ఆడుకునే పిల్లలపై దాడి చేస్తున్నాయని, అనేక మంది పిల్లలు గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందిన సంఘటనలూ ఉన్నాయని పేర్కొంటున్నారు. పేరుకే మున్సిపల్ కార్పొరేషన్.. ఎక్కడ చూసినా మురికి, చెత్తదిబ్బలు, పందుల సంచారం. ఇదేనా పారిశుధ్యం అంటే అని విమర్శిస్తున్నారు.

చర్యలు శూన్యం

పందులు చెత్త కుండీల వద్ద, వీధుల్లో స్వైరవిహారం చేయడంతో పారిశుధ్యం అధ్వానంగా మారి దోమలు విజంభిస్తున్నాయి. అసలే వర్షా కాలం కావడంతో దోమల కారణంగా అంటు రోగాలు సోకే అవకాశం ఉందని భయాందోళనలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. గతంలో అధికారులు పందుల పెంపకం దారులకు ఊరికి దూరంగా పందులను ఉంచాలని హెచ్చరికలు జారీ చేశారు. అయితే కొద్దిరోజులు దూరంగా ఉన్నట్లే ఉంచి మళ్లీ మామూ లుగానే గ్రామాల మధ్య వదిలేస్తున్నారు. రాత్రి వేళల్లో, తెల్లవారు జామున పందులను వీధుల్లో కాపరులు వదిలి వెళ్తున్నా రు. పట్టణంలోని పందుల స్వైర విహారంపై చర్యలు తీసుకోవాలని గతంలో మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా వాటిపై చర్యలు తీసుకున్న పాపన పోలేదు. మున్సిపల్ అధికారులు ఇప్పటికై నా స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కాలయాపనతో ఇక్కట్లు



పందుల స్వైర్య విహారం కారణంగా ప్రజలు రోగాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదు. పట్టణంలో ఏ మూల చూసినా పందులు విచ్చల విడిగా సంచరిస్తున్నాయి. చర్యలు తీసుకోవాలంటే అధికారులు కాల యాపన చేస్తున్నారు గాని చర్యలు తీసుకున్న పాపాన పోలేదు.

– తాడి కస్తూరి, గృహిణి, నాగంపేట

అప్రమత్తంగా ఉండాలి



ప్రస్తుత వాతవరణ మార్పుల వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. పట్టణంలో పందుల సంచారం కారణంగా అపరిశుభ్ర వాతావరణ లేకుండా చూసుకోవాలి. డెంగీ, సీజనల్ వ్యాధులపై అనుమానం ఉంటే వెంటనే ఆసుపత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలి.

– డాక్టర్ సూర్యకుమారి, ఏరియా ఆసుపత్రి వైద్యురాలు, పెద్దాపురం

చర్యలు చేపడతాం



పందుల స్వైర విహారంపై సంబంధిత యజమానులకు గతంలో నోటీసులు అందించి, కింది స్థాయి సిబ్బందికి పూర్తి ఆదేశాలను జారీ చేశాం. వెంటనే పందుల నిర్మూలనకు శాశ్వత చర్యలు తీసుకుంటాం.

– శ్రీకాంత్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్, పెద్దాపురం

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరవు

- వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సుజాత



పిఠాపురం: కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువై శాపంగా మారిందని వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వర్ధినీడి సుజాత విమర్శించారు. ఈ మేరకు శనివారం ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. మహిళలకు ఉచిత బస్సు అంటూ చంద్రబాబు చేసిన వాగ్దానం పచ్చి మోసమని తేలిపోయిందన్నారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఆర్టీసీ బస్సుల్లో మహిళలందరికీ ఉచిత ప్రయాణమని హామీ ఇచ్చారన్నారు. ఇప్పుడు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నట్లు చెబుతున్నారని, కేవలం దానిని కొన్ని బస్సులకే పరిమితం చేసి మహిళలను మోసం చేస్తున్నారని ఆమె ఆరోపించారు. బడి, గుడి అని తేడా లేకుండా ఎక్కడ పడితే అక్కడ మద్యం అమ్మకాలు పెరిగిపోవడంతో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. వీటికి తోడు పర్మిట్ రూంలు ఏర్పాటు చేయడం వల్ల మహిళలు రోడ్డు మీదకు రావాలంటే భయపడే పరిస్థితి ఎదురైందని వాపోయారు.

అనురాగాలకు ప్రతీక రక్షాబంధన్



అన్నకు రాఖీ కడుతున్న ఓ చిన్నారి



చెట్టుకు రాఖీలు కట్టిన గంగాధర్ దంపతులు



రాఖీలు కడుతున్న విభిన్న ప్రతిభావంతుల చిన్నారులు



ఎమ్మెల్యే రాజప్పకు రాఖీ కట్టిన మహిళలు

సామర్లకోట: అనురాగాలు, అనుబంధం, ఆత్మవిశ్వాసం..అన్నీ సమపాళ్లలో కలిసిన అనుబంధమే రక్తసంబంధం. సదోరసోదరీమణుల మధ్య ప్రేమకు చిహ్నంగా నిలిచే రక్షాబంధన్ వేడుకలను పెద్దాపురం నియోజకవర్గ పరిధిలో శనివారం ఉత్సాహంగా జరిగాయి. శ్రావణ పౌర్ణమిని పురస్కరించుకుని ప్రతి ఇంట్లోని మహిళలు, బాలికలు తమ సోదరులకు రాఖీలు కట్టి వేడుకలను వైభవంగా జరుపుకున్నారు. రాఖీలు కట్టి జీవితంలో ఉన్నత స్థానాలను చేరుకోవాలని, ఎల్లవేళలా అండగా, రక్షణగా నిలవాలని ఆకాంక్షించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకున్నారు.

ప్రకృతి పరిరక్షణకు వృక్షాబంధన్

సామర్లకోట: ప్రకృతి పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ వృక్షాబంధన్ కార్యక్రమాన్ని చేపట్టాలని జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగ, ధర్ అన్నారు. శనివారం రక్షాబంధన్‌ను పురస్కరించుకొని స్థానిక విశాలాక్షినగర్‌లో మొక్కలు నాటి అనంతరం చెట్లకు రాఖీలు కట్టారు. ఆదిత్య యూనివర్సిటీ చాన్సలర్ డాక్టరు ఎన్.సతీష్‌రెడ్డి పిలుపు మేరకు ప్రకృతి పరిరక్షణ కొరకు తన వంతు బాధ్యతగా తరుచూ మొక్కలు పెంచే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటడం ఒక్కటే ఉత్తమ మార్గమన్నారు. ప్రతీ ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు.

ఎమ్మెల్యేకు రాఖీ కట్టిన మహిళలు

సామర్లకోట: మండల పరిధిలోని అచ్చంపేట గ్రామంలో శనివారం శ్రావణ మాసం రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని వెలుగు సిబ్బంది ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు రాఖీలు కట్టారు. ఈ సందర్భంగా ఆయనకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో వెలుగు ఏపీఎం జగదీశ్వరీ, మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

పెద్దాపురం: అన్నాచెల్లెళ్ల అనుబంధాన్ని తెలియజేసే రక్షాబంధన్ (రాఖీ) పర్వదినాన్ని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఘనంగా జరుపుకున్నారు. సోదరులకు రాఖీలు కట్టి, స్వీట్లు తినిపించి తమ ప్రేమను తెలియజేస్తూ కుటుంబ సభ్యులతో ఆనందంగా గడిపారు. దూరప్రాంతాల్లో చెల్లెలు కోసం రాఖీ కట్టించేందుకువెళ్లిన అన్నలతో కుటుంబాల్లో పండుగ వాతావరణం సంతరించుకుంది. మండలంలోని పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాల విద్యార్థులు సోదర భావం తెలియజేస్తు పాఠశాల ప్రిన్సిపల్ రాయవరపు సత్య ఆధ్వర్యంలో రాఖీలు కట్టించారు.

కొత్తపల్లి: రాఖీపౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలు శనివారం మండలంలో ఘనంగా జరిగాయి. అన్నలకు చెల్లెళ్లు, తమ్ముళ్లకు అక్కలు రాఖీలు కట్టడంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది. సోదరులు తమ స్తోమతకు తగ్గట్టుగా అక్కాచెల్లెళ్లకు బహుమతులు అందజేశారు.

ఊరటనిచ్చిన వర్షం



సామర్లకోటలో కురుస్తున్న వర్షం

సామర్లకోట: గత 15 రోజులుగా వేసవి కాలాన్ని తలపిస్తూ ఎండలు దంచికొట్టడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలకు శనివారం కురిసిన వర్షం కొంత మేర ఉపశమనాన్ని కలిగించింది. గాలి లేక అల్లాడిపోయిన ప్రజలకు సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం కొంతమెర చల్లబడింది. మెట్ట ప్రాంతాలలో వరిసాగు చేసు కొనే రైతులకు సాగునీరు లేక అల్లాడి పోతున్నారు. దుంప పంటకు ప్రస్తుతం వర్షాలు కావలసి ఉండగా శనివారం కురిసిన వర్షం ఏమాత్రం ప్రయోజనం లేదనే రైతులు చెప్పుతున్నారు. 20 నిమిషాల కురిసిన వర్షానికే స్టేషన్ సెంటర్, జయలక్ష్మి థియేటర్ రోడ్డు, సత్యనారాయణపురం, సీతారామకాలనీలు నీట మునిగిపోయాయి. స్టేషన్ సెంటర్‌లో డ్రైన్లలోనికి వర్షపు నీరు వెళ్లే మార్గం లేక పోవడంతో రోడ్లు చెరువులును తలపించాయి

రాష్ట్ర స్థాయి షటిల్ పోటీల్లో ప్రథమం



ప్రథమ బహుమతి అందుకున్న హరికృష్ణ, చరణ్‌రామ్

సామర్లకోట: విశాఖ జిల్లా గాజువాకలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19 షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన వీరంరెడ్డి హరికృష్ణ జంట ప్రథమ బహుమతి సాధించింది. హరికృష్ణ తండ్రి, వైఎస్సార్ సీపీ యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు వీరంరెడ్డి నాని శనివారం ఈ విషయం తెలిపారు. హైదరాబాద్‌లోని అకాడమీలో శిక్షణ పొందుతున్న హరికృష్ణ, టి.చరణ్‌రామ్ (చిత్తూరు జిల్లా) జంట విశాఖ జిల్లా గాజువాకలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారని వివరించారు. ఫైనల్స్‌లో శుక్రవారం రాత్రి విశాఖకు చెందిన బాలప్రణయ్, నెల్లూరుకు చెందిన మహీధర్ జంటపై 21-19, 21-18తో విజయం సాధించారని తెలిపారు. హరికృష్ణను వైఎస్సార్ సీపీ పెద్దాపురం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు, మండల అధ్యక్షుడు తలారి దొరబాబు, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మోరంపూడి శ్రీరంగనాయకులు, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్ అభినందించారు.

ట్రాఫిక్ సమస్యకు మోక్షమెప్పుడో ?

- విస్తరణకు నోచుకోని కాకినాడ రోడ్డు
- మాధవపట్నం రైల్వే గేటు వద్ద నిత్యం ట్రాఫిక్ అవస్థలు



మాధవపట్నంలో ట్రాఫిక్‌లో చిక్కుకున్న వాహనాలు

సామర్లకోట: మండల పరిధిలోని మాధవపట్నం రైల్వే గేటు వేసినా, తీసినా ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా సమస్యను పరిష్కరించే నాథుడు కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడకు ప్రధాన మార్గం ఏర్పడిన తరువాత ఇప్పటి వరకూ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. కాకినాడకు రోడ్డు మార్గం ఏర్పడిన తరువాత ప్రస్తుతం కొన్ని వందల రెట్లు వాహనాల రాక పోకలు పెరిగినా రోడ్డు విస్తరణకు నోచుకోలేదు. రాష్ట్రంలో రద్దీ లేని అనేక రోడ్లను విస్తరిస్తున్నప్పటికీ నిత్యం రద్దీగా ఉండే సామర్లకోట-కాకినాడ రోడ్డుపై దృష్టి సారించకపోవడంపై ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో..

కాంగ్రెస్ పార్టీ కేంద్రం, రాష్ట్రంలో అధికారంలో ఉన్న సమయంలో ధవళేశ్వరం నుంచి కాకినాడ వరకూ రోడ్డు విస్తరణకు పనులు ప్రారంభించారు. కాకినాడ రోడ్డు మార్గంలో వీకే రాయపురం, మాధవపట్నం గ్రామాల్లో రోడ్డు మార్జిన్‌లో ఉన్న ఆక్రమణలు తొలగించి వారికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, కొంత మందికి నష్ట పరిహారం చెల్లించారు. తరువాత ప్రభుత్వాలు మారడంతో రోడ్ల విస్తరణ పనులు ఎక్కడిక్కడే నిలిచిపోయి కాకినాడకు వెళ్లే వారికి తిప్పలు తప్పడం లేదు.

ఈ రోడ్డులో ప్రతిరోజూ ఏడు వేల నుంచి 8 వేల వరకు వాహనాల రాకపోకలు జరుగు తాయని అంచనా వేస్తున్నారు.

రైల్వే గేటు మీదుగా..

మాధవపట్నం రైల్వే గేటు మీదుగా వందలాది వాహనాలు రాక పోకలు సాగిస్తున్నాయి. ఇటువంటి సమయంలో రైల్వే గేటు వేసిన, తీసిన తరువాత గేటు నుంచి సామర్లకోట-కాకినాడ రోడ్డు వరకూ బారులు తీరిన వాహనాలు, సామర్లకోట-కాకినాడ రోడ్డుకు ఇరువైపులా నిలిచిన వాహనాలతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. మాధవపట్నంలో రైల్వే గేటు వేసిన సమయంలో కనీసం ఇద్దరు కానిస్టేబుల్స్ నియమిస్తే కొంత వరకు ట్రాఫిక్ సమస్యను పరిష్కరించే అవకాశం ఉంటుందనే వాదనలు ఉన్నాయి. ట్రాఫిక్ సమస్య శాశ్వత పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఏరులై పారుతున్న మద్యం

- ఏపీ లిక్కర్ బౌల్‌గా మార్చేస్తున్న చంద్రబాబు
- వైఎస్సార్ సీపీ నేత జమ్మలమడక నాగమణి



కాకినాడ రూరల్: రైస్ బౌల్ ఆఫ్ ఇండియాగా ప్రఖ్యాతి గాంచిన ఆంధ్రప్రదేశ్‌ను చంద్రబాబు ప్రభుత్వం లిక్కర్ బౌల్ ఆఫ్ ఇండియాగా మార్చేసిందని వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి అన్నారు. కాకినాడ 49వ డివిజన్ కొత్త గైగోలుపాడులోని తన నివాసం వద్ద శనివారం సాయంత్రం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా మద్యం ఏరులై పారుతుందన్నారు. అనేక కుటుంబాలు మద్యం వల్ల వీధిన పడుతున్నాయన్నారు. విచ్చలవిడిగా మద్యం దుకాణాలకు ప్రభుత్వం అనుమతి ఇవ్వడం, వీధివీధినా బెల్ట్ షాపులు నెలకొల్పడంతో మద్యం మత్తులో పేద, మధ్య తరగతి కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయన్నారు. స్వర్ణాంధ్రప్రదేశ్ సారథిగా చెప్పుకొనే బాబు మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ ఎమ్మెల్యేలు ముడుపుల మత్తులో మద్యం దుకాణాలు లేని ప్రాంతాల్లో అనధికార అమ్మకాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. రెగ్యులర్ లైసెన్స్ పొందలేక పోతున్న వ్యాపారులు ఇప్పటికి ప్రొవిజనల్ లైసెన్స్‌పైనే 489 దుకాణాలు నడుపుతున్నారని, బెల్ట్ షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు పెరగడంతో బాటిల్‌పై రూ.10 నుంచి రూ.30 వరకు అదనంగా అమ్మకాలు చేస్తున్నారని దుయ్యబట్టారు. మద్యం అమ్మకాల టార్గెట్‌లతో ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరించడంతో నియంత్రణ కొరవడిందన్నారు. ఆర్టీజీఎస్ సర్వేలో ఎమ్మార్పీ ఉల్లంఘనలు ఉన్నాయన్న 87.2 శాతం ఒక వర్గం ప్రజల అభిప్రాయాలను గతంలో ఎల్లో మీడియా ప్రచురించిందని గుర్తు చేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మద్యం అమ్మకాలు తగ్గాయని గణాంకాలు చెప్పాయని, చంద్రబాబు పాలనలో మద్యం ఏరులై పారుతుందన్నారు.

రాజరాజేశ్వరీదేవిగా వనదుర్గమ్మ

- ముగిసిన శ్రావణమాస ఉత్సవాలు
- అమ్మవారికి చండీ, ప్రత్యంగిర హోమాలు



వనదుర్గమ్మ చండీ హోమం పూర్ణాహుతిలో పాల్గొన్న దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు, వేదపండితులు అర్చకులు.



(అంతర చిత్రం) రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చిన వనదుర్గమ్మ

అన్నవరం: రత్నగిరిపై గత ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వనదుర్గమ్మ శ్రావణమాస జాతర మహోత్సవాలు శనివారం నిర్వహించిన ప్రత్యంగిర, చండీ హోమాల పూర్ణాహుతితో ముగిశాయి. చివరిరోజు అమ్మవారు ఒక చేతిలో శంఖం, మరో చేతిలో చక్రం, ఇంకో చేతిలో చెరుకుగడ, మరో చేతిని అభయహస్తంతో రాజరాజేశ్వరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం తొమ్మిది గంటలకు పండితులు అమ్మవారికి నవగ్రహజపాలు, శ్రీచక్రార్చన, పురుష, శ్రీసూక్త పారాయణలు, మూలమంత్ర జపాలు, సూర్యనమస్కారాలు, సప్తశతీ పారాయణలు నిర్వహించారు. అనంతరం చండీ, ప్రత్యంగిర హోమాలు ప్రారంభించారు. 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు కుటుంబ సభ్యులతో కలసి హోమంలో పాల్గొన్నారు.

ఒకే సమయంలో రెండు హోమాల పూర్ణాహుతితో అయోమయం

వనదుర్గమ్మ జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయం వద్ద చండీహోమం, ఆలయం దిగువ అంతస్తులో శ్రావణ పౌర్ణిమ సందర్భంగా ప్రత్యంగిర హోమం పూర్ణాహుతి ఒకే సమయంలో నిర్వహించడంతో భక్తుల్లో అయోమయం నెలకొంది. రెండు హోమాల పూర్ణాహుతి ఉదయం 11 గంటలకే నిర్వహించారు. రెండు హోమ గుండాల్లో ఏక కాలంలో హోమ ద్రవ్యాలు సమర్పించారు. ఆలయం వద్ద జరిగిన చండీహోమంలో ఈఓ వీర్ల సుబ్బారావు పాల్గొనడంతో ప్రత్యంగిర హోమం వద్ద గల వేదపండితులు, అర్చకులు చండీహోమం వద్దకే వెళ్లిపోయారు. దిగువన అంతస్తులో జరిగిన ప్రత్యంగిర హోమం వద్ద అర్చకుడు, వ్రతపురోహితులు మాత్రమే మిగిలారు. చండీ, ప్రత్యంగర హోమాల పూర్ణాహుతి ఏక కాలంలో కాకుండా కనీసం పావుగంట తేడాలో నిర్వహించి ఉంటే ఈ గందరగోళం ఉండేది కాదు.

రైతులు వరినాట్లకు సిద్ధం కావాలి

జగ్గంపేట: వచ్చే వారం రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతులు వరినాట్లకు సన్నద్ధం కావాలని వ్యవసాయశాఖ ఏడీ గరిమెళ్ల శ్రీనివాస్ సూచించారు. మండలంలోని పలు గ్రామాల్లో నారు మడులను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో సిబ్బందితో ఖరీఫ్ వరిసాగుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గంపేట మండలంలో ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 9,300 ఎకరాలు కాగా ఇప్పటివరకూ సుమారు 2500 ఎకరాల్లో మాత్రమే వరినాట్లు పూర్తయ్యాయని తెలిపారు. మరో 500 ఎకరాల్లో వరి విత్తనాలు వెదజల్లారని చెప్పారు. మండలంలో 6000 ఎకరాల్లో వరి నాట్లు పడవలసి ఉందన్నారు. ఈ ఏడాది వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ వరిసాగు ఆలస్యమైందన్నారు. అల్పపీడన ప్రభావంతో వారం రోజుల్లో వర్షాలు కురుస్తాయని, వరినాట్లు వేసుకోవడానికి రైతులను సన్నద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ నెలాఖరు వరకూ వర్షాలు లేని పక్షంలో రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకునేందుకు వీలుగా అవసరమైన విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో జగ్గంపేట మండల వ్యవసాయ అధికారి నరసింహం, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.